తీక దేవియా

రేభా కులకర్ణి

"తుమ్ సప్నే దేఖే హై, సప్నే కా టూట్ బాహువా నహీ దేఖా'- ఈ రోజు విజయానంద్ అన్న మాటలు బదు సంవత్సరాల క్రితమే నే నన్నాను, కృష్ణా!" ఖాళీ అయిన కాఫీ గ్లాసును టేబులుపై పెడుతూ పలికాడు రాజా. "జీవితాన్ని ప్రతి క్షణం కలల మధ్య ఊహించుకుంటున్న నువ్వు అవి ఫలించక దెబ్బతింటే ఎంత ప్రమాదమో హెచ్చరించాను." మౌనంగా విన్నాడు కృష్ణ. తన కలలు ఫలించలేదంటే ఒప్పుకుంటాడు. తను దెబ్బ తిన్నాడంటే అంగీకరించడు.

చేతిలోని ఇంగ్లీషు పేపరును ముడిచాడు చలపతి. "అంతేకాదు, కృష్ణా! దుర్గను నువ్వు విపరీతంగా ఆరాధిస్తున్నప్పుడు—కాదు—ప్రేమిస్తున్నప్పుడు నేనూ హెచ్చరించాను, జీవిత మెప్పుడూ నవ్ వే ట్రాఫిక్ కాదని."

"దుర్గ అంటే శాస్త్రి మరదలా?" రాజా ప్రశ్నకు తల ఊపాడు చలపతి. "ఓ పోస్టు గ్రాడ్యుయేట్‌ను వివాహమాడి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూంది."

ఫిబ్రవరి నెల మొదటి ఆదివారం ప్రభాత సమయం. మేఘాల మాటున సూర్యుడు ఒళ్లు విరుచుకుంటున్నాడు. హోటల్ 'మిత్రమ్' లోని మారు మూల టేబు లది. ఆ ముగ్గురి కలవాటయినది. మౌనంగా కూర్చున్నారు.

"దోస్త్!" మెల్లగా పలికాడు కృష్ణ. "జీవితాన్ని కలల మధ్య చూసుకున్నాను. నిరాశ మధ్య గమనించాను. నేను చెదిరిపోలేదు. చెదిరీ పోలేదు. దెబ్బతిన్నా నమకుంటున్నారా?"

చలపతి నవ్వాడు.

"ప్రతి మనిషి పైకి కనిపించినంత ఆనందంగానూ, ఆరోగ్యంగానూ ఉంటాడంటే నే నంగీకరించను." తను ఏకీభవించాడు రాజా—చలపతి మాటలకు. "ఫరెగ్జాంపుల్ నా కేసే తీసుకో! 'నమా' ను ప్రేమించి తను కాదంటుందేమోననే అనుమానంతో పైకి నవ్వుతూ నిర్లక్ష్యంగా తిరిగినా మనసున ఎంత విలవిలాడి పోయానో తెలుసా?"

"కాని కృష్ణ రాజాకాదు, రాజా!"

"రాజా స్నేహితుడు. అవునా!" చలపతి మాటలకు కృష్ణ తల ఊపాడు. "నీ కింకా అహంకారం తరిగిపోలేదు."

"అహంకారమనకు, పతి! ఆత్మ విశ్వాసమను."

అప్పటివరకు కరెంటులేక ఆగిపోయిన ఫాను తిరగసాగింది. హెడ్ లైన్సు తిరిగి చదువుతూ నంటున్నాడు తెలుగు వార్తల తాలూకు వ్యక్తి.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. తిరిగి మొదలయిన వారి మాటలు ప్రవాహంలా సాగిపోయినాయి. బాలట్ పేపర్లు, కాంగ్రెసు విజయం, బడ్జెట్, బాంగ్లాదేశ్, పూరన్ బోర్ పథ్రిస్, తేరే మేరే సప్నే, కుటుంబరావు, రా. వి. శాస్త్రి, ఎమెస్కో బుక్స్, బాపు బొమ్మలు, పవన్ ఫ్లవర్, సోఫియా లోరెన్, మొరేవియా, ఎరిక్ సెగల్ లవ్ స్టోరీ, నొబకోవ్ ...

"ఇంగ్లీషు నవల వ్రాస్తున్నానంటివే — చూపించగూడదా?' నిష్ఠూరంగా అడిగాడు రాజా, కృష్ణను.

"మనం ఫెయిర్ చేస్తామేమో నని భయమేమో?" చలపతి వ్యంగ్యం. ఇరువురి మాటలకు నవ్వాడు కృష్ణ.

"చూపించగూడదనే నిషేధమూ, ఫెయిర్ చేస్తారేమో ననే శంకా నాకు లేవు. చూపించడం జరిగి కథ అర్థమయితే నే నిక తిరిగి పూర్తి చేయలేను."

"అసలు పేరేమిటి?"

"పేరింకా అనుకోలేదు. చాలావరకు 'ఏంజల్ ఆఫ్ స్వీట్‌నెస్' అవుతుంది."

తిరిగి మాటల మధ్య కరెంటు పోయింది. మౌనం.

"ఎలా ఉంది నీ టాక్సీ డ్రైవర్ జీవితం?"

"ఎలా ఉంటుంది?" చలపతి మాటలకు ఎదురుప్రశ్న వేశాడు కృష్ణ. "నీ పోస్టల్ ఉద్యోగం కన్నా, రాజా ఎ. ఎమ్. ఎమ్. అర్థతకన్నా బాగుంది."

"నీతో చచ్చే చావురా, బాబూ!" తిరిగి మూడు కాఫీలు చెప్పాడు చలపతి.

"రామారావుపోయి సంవత్సరం దాటిందనుకుంటాను." కృష్ణ తల ఊపాడు.

"శారదెలా ఉంది?" చలపతికేసి చూశాడు కృష్ణ.

కృష్ణ చూపుల భావం బోధపడలేదు చలపతికి. తరవాత తల విదిల్చాడు కృష్ణ. ఆ తల విదిలింపులో చాలా భావాలు గోచరించాయి మిగిలిన ఇరువురికి.

* * *

మహానగర్ సెంట్రల్ స్టేషను దగ్గర ఓ సాయంత్రం రెండు తెల్లని అందమైన చిన్న పాదాలు నల్లని చెప్పుల మధ్య వేళ్లకు మట్టెలతో మెరుస్తూ టాక్సీ ఎక్కబోయి ఆగిపోయాయి. మనసున తొణికిన తొట్రుపాటు కాలి చివరి అంచులకు పాకింది. తెరిచిన కారు డోరును పట్టుకుని విస్ఫారిత నేత్రాలతో అలాగే చూసింది కృష్ణను దుర్గ. దుర్గ కారులో కూర్చుని తన వెనక తలుపు మూసుకుంది. కారు ఎత్తునుండి వల్లానికి జారిపోసాగింది.

"నే గుర్తున్నానా, కృష్ణా?" ఆమె గొంతులోని తొట్రుపాటు, అందులోని అందం అదీ కృష్ణ కలవాటు. ఎలా మరిచిపోతాడు అంత సౌందర్యాన్ని! మరుపు ఆమె కలవాటయితే, తనకూ అంతేనా!

ఆమె ఊపిరి పరిసరాల మధ్య తిరగాలనుకోవటం, నవ్వుల వెన్నెలల మధ్య తన్ను చూసుకోవాలనుకోవటం, ఆమె ఎత్తైన ఎదిగిన గుండెల మధ్య తల బద్దలు కొట్టుకోవాలనుకోవటం అప్పట్లో బి. ఎ. లిటరేచర్‌తోపాటు అతడి ముఖ్యాశయాలు. తనడుగుతూంది నే గుర్తున్నానా — అని! ఏమని చెపుతాడు?

"ఎలా మరిచిపోతాను శాస్త్రి మరదల్ని?" దుర్గ బాధ అద్దంలో గమనించాడు కృష్ణ.

"శాస్త్రి మరదలుగా మిగిల్చి ఇంకే ఆత్మీయత మన మధ్య లేదన్న మాట?"

ఎలా అంటాడు లేదని? ఉంది. చాలా ఉంది. దా న్నింకా పెంపొందించుకోవాలని, ఇంకా దగ్గర కావాలని ఆడిగితే తన కా ఉద్దేశ్యం లేదంది. తనను భర్తగా చూడటం కన్నా స్నేహితుడుగా చూడటమే ఇష్టమూ, ప్రాణమూ అంది.

"శాస్త్రి ఈమధ్య ఎప్పుడూ కలవలేదా, కృష్ణా?"

మెల్లగా నవ్వాడు కృష్ణ. "గుర్తుంటే కదా కలవటానికి! మేం చిన్నప్పుడు కుట్టించుకున్న చొక్కాలం, దుర్గా. ఎదిగిన ఇప్పటి మీ ఆకారాలకు సరిపోం."

"స్పీడుగా డ్రైవ్ చేయకు. స్లిప్పరీ."

"ఉత్తరాలు అంత ప్రేమగా రాసే దానివి. అడ్రసివ్వవేం, దుర్గా? వెంట పడతానని భయమా?"

"నేను పెండ్లయిన ఆడదాన్ని, కృష్ణా. ఉత్తరాలు రాయటానికే గాని పొందటానికి కర్హత లేని దాన్ని."

కారు దిగబోతుంటే కొద్ది గంభీరంగా పలికాడు కృష్ణ: "దుర్గా! నీ చేయి తాకి సంవత్సరం పైన రెండు నెలలయింది."

రెండు సెకండ్లు అతడి ముఖంలోకి చూసింది. తరవాత నవ్వింది. తన చేతిని అతడికి దగ్గరగా జాపింది.

"నీ చేతిని తాకిన ఖరీదు రెండూ ముప్పై పైసలా?"

నడవబోతున్న దుర్గ ఆగిపోయింది. "అంటే?"

"మీటర్ చార్జి ఇవ్వలేదు."

"నువ్వు మారలేదు."

"నేను భగవంతుడికి కృతజ్ఞుడిని.

దుర్గా. నిన్ను చూస్తా నమకోలేదు. చూశాను."

అతడి చేతిని మృదువుగా నొక్కింది.

"నా కీ ప్రపంచంలో రెండు విషయాలిష్టం. ఒకటి—నువ్వు; రెండు — భగవంతుడు."

సంధ్య ప్రపంచాన్ని ప్రేమగా తనకు దగ్గరగా లాక్కుంటూంది. చీకటి పాలిపోయి తెల్లనైంది, లైట్లతో నిండిన పట్టణాన్ని చూసి.

తలుపుమీద మెల్లగా శబ్దం చేశాడు కృష్ణ. ఆ ఇంటి చుట్టూ ఉన్న అమ్యూకరమైన ఇండ్ల తలుపులన్నీ మూసుకొని ఉన్నాయి. వేసిన తలుపులగుండా కొన్ని వెలుగు రేఖలు మ్యునిసిపాలిటీ వారు వ్యర్థమని వదిలివేసిన చీకటి వీథుల్ని కొద్దిగా వెలిగిస్తున్నాయి. ఎప్పుడూ వడగళ్ల వానలా ఉండే ఆ వీథి అంత నిశ్శబ్దంగా ఉండటం కొద్ది అనుమానాస్పదంగా తోచింది. శారద వేమీ అవలేదు గదా?

తిరిగి మరోమారు శబ్దం చేశాడు. వడుస్తున్న నవ్వడి. మెల్లగా తలుపు తీసి పక్కకు తప్పుకుంది శారద. కుండకు చిల్లివడి నీరు వెల్లువైనట్లు లోపలి వెలుతురు చీకటి రోడ్డున బద్దలైంది. తన వెనక తలుపు మూశాడు కృష్ణ. రోడ్డుమీద దీర్ఘ చతురస్రాకారపు వెలుతురు క్రమంగా మాయమయింది. తిరిగి చీకటి.

జేబులోని డబ్బు తీసి శారద చేతి కిచ్చాడు కృష్ణ. "బాబు నిద్రపోయినట్లున్నాడే?" తల ఊపింది శారద. స్వీట్సును అన్నీ శారద చేతిలో పోసి, ఒకటి నిద్రపోతున్న బాబు నవి అర చేతుల మధ్య ఉంచి నిడికిలి మూశాడు. నిద్రన పెదిమలు విడిపోతున్నాయి. పాల భాగాన అలుముకున్న వెంట్రుకలను వెనక్కు తోశాడు. "వెరీ స్ట్రేంజ్! వీథంతా ఈ రోజు ఇంత నిశ్శబ్దంలో ఉందే!"

శారద మాట్లాడలేదు. పెదిమలు బిగించింది. బిగించిన పలుచని పెదవుల్ని నెట్టుకుని దుఃఖం పెల్లుబికింది. మాటలు ఏడ్పులో కలిసిపోయినాయి. ముఖాన్ని గోడవైపు తిప్పి, గోడన ముఖం దాచుకుని ఏడ్చింది శారద. తనను మరిచి, ప్రకృతిని మరిచి ఏడ్చింది. చేతివేళ్ల పలుచనయి డబ్బు, స్వీట్సు జారి నేలన పరుచుకున్నాయి.

తలుపు తెరిచి, తను బయటికి వచ్చి, తలుపు దగ్గరగా వేసి బయట అరుగు మీద కూర్చున్నాడు కృష్ణ. "నన్ను క్షమించు, రామారావ్! నేనేం చేసేది?"

శారదను తలుచుకుంటే అంతరాల మధ్య బాధ కండ్లవెంట నీరై తిరిగింది.

ఆయాసంగా, బరువుగా ఊపిరి తీయ సాగాడు రామారావు. తలకు, చేతులకు, ఒంటినిండా కట్లు. చుట్టూ తెల్లని నునుపని గోడలు. మందుల వింత వాసన. ఎమర్జన్సీ వార్డది.

"హౌ ఈజ్ హి, డాక్టర్?" ఆదుర్దాగా అడిగాడు కృష్ణ, డాక్టరు ముఖం చూస్తూ.

"సారీ, సర్! చాలా భయంకరమైన ఏక్సిడెంట్. హాస్పిటల్‌కు తెచ్చేలోపలే ఇరువురు పోయారు. మిగిలింది... ఉయ్ ఆర్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ, సర్. నో హోప్."

అడుగు వెక్కడో ఇంకిపోక మిగిలిపోయిన కన్నీళ్లు కండ్లు అంతటా నిండి నీటి చెమ్మ లయాయి రామారావు నేత్రాలు. "డోంట్ ఫీయర్, రామూ! డాక్టరు ఫరవాలేదన్నారు." అది అబద్ధం. రామారావుకు తెలియదా అది? మెడ కింది భాగమంతా చైతన్యరహితమై చలనానికి కూడా వీల్లేకుండా ఉంది. "కృ...ష్ణా..." మాట నంగిగా ఉంది. పెదిమలు పూర్తిగా విడివడటంలే. ఎక్కడో మాతిలోపలి మాటలా ... తలను రామారావుకు దగ్గరగా తెచ్చాడు. "నాకు ఎవరూ లేరు. శారద...చూడు... లుక్ ఆఫ్టర్ హెర్ ... కృష్ణా!"

తలుపు తెరిచి బయటి కొచ్చిన శారదకు నిద్రపోతూ కనిపించాడు కృష్ణ. రెండు క్షణాలు అలాగే చూసింది. ఇతడికీ తనకూ సంబంధమా? ఛీ ... పాడులోకం! ఎంత తేలికగా వ్యక్తుల శరీరాలకు సంబంధం అంటగడుతుంది! అతడు తన కేమవుతాడు? తన భర్తకు స్నేహితుడు. తనకు స్నేహితుడు. తన రంగనాయకుల పూజను భర్త పరిహసించేవాడు. అక్కడి దేవుడు శిల అయి గుళ్లో కూర్చుని చైతన్యాన్ని మంచి తనంతో పాడిగి ఈ స్నేహితుడి కిచ్చాడా?

"కృష్ణా!" ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. "నిద్రపోయావా?"

నీళ్లు బయట పెట్టింది శారద. స్నానం పూర్తి చేశాడు. ఒంటి ప్రశాంతత మనసుకు నిర్మలత్వాన్నిచ్చింది. ఎడమ కాలును బాసిట మడిచి, కుడికాలును ఎడమకాలు ముంగిట నిలిపి, చీరను పాదాల అంచుల వరకు లాగి, కూర్చుని వడ్డించసాగింది శారద. ఇందాకటి శారద ఏడ్పుకి కారణ మర్థమవ సాగింది కృష్ణకు.

"ఇక్కడినుంచి మరో చోటుకు వెళ్లిపోదామా?"

"ఎక్కడున్నా మనుషుల అంతరంగా లివేగదా?"

కృష్ణ మాట్లాడలేదు. కొన్ని కథలకు ముగింపులు ఉండవు. ముగింపు లేనంత కాలం ప్రజలకు అనుమానమే!

ఓ రాత్రి వేళ శారదకు మెలకువ వచ్చి చూసేవరికి కృష్ణ వ్రాసుకుంటూ కనిపించాడు. శారదకు తెలుసు, అతడు నవల తాలూకు మిగిలిన భాగాలు పూర్తి చేస్తున్నాడని.

"పగలంతా కష్టపడతావు. రాత్రి వేళ ఇంతసేపు మేల్కొంటే ... ఆరోగ్యం దెబ్బతినదా?" మెల్లగా పలికింది శారద.

"అయిపోయింది. క్లోజ్ చేస్తున్నాను." తిరిగి రాయడం మొదలెట్టాడు కృష్ణ. మంచం నుండి లేచి టేబులు దగ్గరగా వచ్చింది శారద. "12 గంట లయి ఉంటుంది. ఇంకా ఇలా ..." పెన్నును ముడిచేశాడు. కాగితాలు పొరుగులో దాచాడు. లైటు ఆరిపోయింది.

మంచం మీద పరున్న కృష్ణ కండ్ల వెంట నీళ్లు తిరిగినాయి. తనను ఇలా అడ్డుపెట్టే వారు కావాలని అందంగా కన్న అనేక కలల్లో ఇదో భాగం. దుర్గా, ఎంత మోసం చేశావ్!

తెల్లవారుఝామున అతడి చెంపలమీద ధారకట్టిన కన్నీళ్లు చూసి బాధ పడింది శారద. అతడి బాధ లేమిటో తనకు తెలియవు. అతడి భుజంమీద చెయ్యేసి అతడి వేదనను వినటం కాని, సానుభూతి చూపటం కాని చేయలేదు. కాదు; చేయగూడదు. తప్పు.

కుటుంబరావు అనుభవాన్ని టేబులు మీద పడేశాడు కృష్ణ. రాజారావు 'సర్వెంట్ అండ్ ది రోప్' పేజీలు తిప్పుతున్నా రాజా కృష్ణకేసి చూశాడు.

"ఫ్రెండ్స్! మీ ఇరువురి పరిసరాల మధ్య ఓ చిన్న ఇల్లు అద్దె తక్కువలో కావాలి."

చలపతి వింతగా చూశాడు. "ఇప్పుడుంటున్న ఆ ఇంటి కేమొచ్చింది? అద్దె కూడా తక్కువేగదా?"

"ఇంటి ఓనరు ఖాళీ చేయమన్నాడా?" రాజా అడిగాడు. కాదు-తల ఊపాడు కృష్ణ.

"మరి?" "అక్కడి మనుష్యులు మంచివాళ్లు కాదు, బ్రదర్."

"ఇది చాలా పిచ్చి, కృష్ణా! మనుష్యులు, భూమి ఒకటే! ఎక్కడకు వెళ్లినా అదే మనుష్యులు, అదే భూమి."

"కాదనను, చలపతీ. భూమిలో రకాలున్నట్లే మనుషుల్లోనూ. పొరవంతమైన నేలకు, సంస్కారం మిగిలిన చోటుకు వెళదామని."

"మనుష్యులు నోరు మెదపకుండా చేయాలంటే ఒకటే మార్గం, కృష్ణా!"

"ఏమిటది?" చలపతిని చూశాడు కృష్ణ.

"శారదను దూరంగా పంపించేయటం."

"మీ ఇరువురికి శారద విషయం తెలిసీ ఇలా అంటున్నారంటే ... మీకు తెలుసు శారదకు నా అనేవా రెవరూ లేరు. భర్త పోయిన తదుపరి... ఆమె వెళ్లి బయటకు పంపేది? ఎక్కడకు పంపేది?"

"నువ్వు తప్పుగా అర్థం చేసుకుంటున్నావ్, కృష్ణా. దూరంగా పంపించేయటం అంటే పెండ్లి చేసేయమని."

కాఫీ వెయిటరుకు చెప్పాడు చలపతి. కృష్ణ మాట్లాడలేదు టేబులున గీతలు గీస్తూండిపోయాడు. రాజా పుస్తకం పేజీలు చూస్తూ మిగిలిపోయాడు.

"బాగుంది, రాజా, మీ ప్రతిపాదన. కాని, శారద అంగీకరిస్తుందా? ఎటొ ఆల్ శారద భర్త పోయిన ఆడది. ఎవరంగీకరిస్తారు?"

"నువ్వు." రాజా, చలపతి ముక్తపరిగా పలికారు. కండ్లు పెద్దవిచేసి చూశాడు కృష్ణ. "క్షమించండి. డ్రాప్ దట్ మాటర్."

కొన్ని క్షణాలు నిశ్శబ్దం.

"చలపతీ, నీ దగ్గర కలర్ ఫిల్మున్నదా?" హఠాత్తుగా అడిగాడు కృష్ణ.

"ఏం, కలర్ ఫోటో కావాలా? సాయంత్రం తీద్దాం."

"సాయంత్రంకాదు, నెక్స్ట్ సన్ డే.

ఆరాధనలో ఆనందం వెతుక్కొంటారు కొందరు. ప్రేమలో దైవాన్ని దాచుకొంటారు కొందరు మూగగా ఆలోచనల మధ్య అనుభూతుల మల్లెపూలను పూయించుకొంటారు మరి కొందరు. ఇటువంటి మూడు మనస్తత్వాల మధ్యలో జీవితాన్ని ప్రతి క్షణం కలల మధ్య ఊహించుకొనే వ్యక్తి కథకు ముగింపు దొరకడం సాధ్యమా ?

నే నొక్కణ్ణే కాదు, చంద్రికను, నన్ను కలిపి తీయాలి."

ఇరువురూ కృష్ణ నాశ్చర్యంగా చూశారు. "చంద్రికా? హూ ఈజ్ షి?"

"ఆమె ఓ వ్యభిచారి. ఓ రోజు నా టాక్సీ లోనే ఎక్కింది, మరో యువకుడితో కలిసి. వారి మాటల మధ్యన తెలిసింది, ఆమె పేరు చంద్రిక అని, డిబాచీ అని."

"ఆమె ఒప్పుకుందా? అనలెందుకు?" రాజా కుతూహలంగా అడిగాడు.

"నే నింకా అడగలేదు. 'ఏంజల్ ఆఫ్ స్వీట్‌నెస్' పూర్తి అయింది. దానికి కవర్ పేజీ."

గదిని కడిగేసి వంట ఇంటిలో లైటు ఆర్పేసింది శారద. పక్క పరచబోతున్న శారద ఆగిపోయింది, కృష్ణ పాంటు, షర్టు వేసుకోవటం చూసి. "తిరిగి ఇప్పుడు బయటకు వెళ్లాలా?" ఆ గొంతున వణికిన సానుభూతికి కొద్దిగా చలించాడు కృష్ణ. తల ఊపాడు. "ఎక్కడికి?" అడుగకూడ దనుకుంది శారద. మనసుతో నిమిత్తం లేకుండా ప్రశ్నలు బయటకు వచ్చింది.

"చంద్రిక ఇంటికి."

"చంద్రికా? చంద్రికెవరు?" తను అడగకూడదు. అతడి స్వవిషయాల్లోకి తను అడుగేయ కూడదు. సీతకు లక్ష్మణుడు గీసిన గీత హద్దులాంటిది తన పరిధి.

కొన్ని క్షణాలు సందేహించాడు. "వ్యభిచార గృహంలో నివసించే ఆడది."

శారద చైతన్యం ఉడిగిన బొమ్మై పోయింది. కృష్ణ తలుపు గడియ వేసుకోమని బయటకు వెళ్లిపోయాడు.

బాబు పక్కన పరుంటూ మనసున అనుకుంది శారద: 'ఇలా ఎందుకయాడు?' తిరిగి తనే అనుకుంది: 'ఎందుకు కాదు?'

అనేక ఏళ్లుల మలుపులు తిరిగి, లైటు స్తంభాలు తిరిగి పోయి, చీకటిగా ఉన్న ఆ గల్లీలో కొంత దూరం నడిచి ఇంటిముం దాగి తలుపు శబ్దం చేశాడు. తలుపు కొద్దిగా తెరుచుకుంది. లోపలి గుడ్డి వెలుతురు సందు నుండి కృష్ణ ముఖం మీద పడ్డది. వెలుగు నడ్డుకుంటూ బలిష్ఠుడైన మనిషి తొంగి చూశాడు. "ఎవరు కావాలి?" తాగిన వానవ అతడి నోటిముండి వెలువడ్డది. "చంద్రిక." తలుపు తెరుచుకుంది. తలుపు మూసుకుంది.

సోఫాలో కూర్చున్న యౌవనం తరిగి పోయిన ఆడది పెదిమలు విడదీసి నవ్వింది. దాని పళ్లు హైదరాబాద్ రోడ్లలా ఉన్నాయి, పాన్‌తో ఎర్రబడి. దివస్య తాలూకు అనుభవం ముడతలు దాని మెడన, పొట్టన గతంలోని వైభవం తాలూకు క్షీణించిపోయిన కట్టడంలా ఉంది.

"చంద్రిక లేదు. లక్ష్మి ఉంది." తలుపు తెరిచిన వ్యక్తి దాని కాళ్లదగ్గర కూర్చుని పాదా లొత్తుతున్నాడు.

"చంద్రిక ఏమయింది?"

"తన గదిలోనే ఉంది. ఒంటరిగానే ఉంది. ఒంట్లో నలతగా ఉంది."

ఆకాశంలో మిలమిలా మెరుస్తున్న తారలను చూస్తూ పరున్న చంద్రికకి సంభాషణ వినిపిస్తూనే ఉంది. అయినా కదల్లేదు. దిండును చేతుల క్రిందకు లాక్కుని బోర్లా పరుండి నక్షత్రాలను లెక్కపెట్ట సాగింది. ఒకటి... రెండు... మూడు ...

"కొంతసేపు మాట్లాడి వెళతాను, పిలుస్తారా?"

లెక్క కుదరటంలే. దిండును పక్కకు నెట్టేసి, మంచం నుండి లేచి చీర సరిచేసుకుంది. గడియ తీసి బయటకు వచ్చింది. "ఇలా రండి."

ముసలిదా వ్వోమారు చూసి చంద్రికను చూసి మృదువుగా నవ్వాడు. తమా పెదిమలు విడదీసింది. తలుపు గడియ వేసింది.

"ఆ మంచం మీద కూర్చోవచ్చా?"

"మాట్లాడుతావన్న వ్యక్తులకు మంచా లెందుకు?"

"మాటలే అని వస్తే తలుపు గడియ వేసేందుకు." నవ్వింది చంద్రిక.

"గడుసువారే!"

"అలవాటులేని వాడిని." చంద్రిక గడియ తీయబోతే వారించాడు కృష్ణ.

"ఈ గదిలో మరో ఆసనం లేకపోతే అడిగాను."

తమా అతడికి కొద్ది దూరంలో మంచాన కూర్చుంది. "నా పేరు కృష్ణ."

"తరవాత..."

"నేను రచయితను." నవ్వింది చంద్రిక. "పావనం ఈ గది. తమరు కవీశ్వరులన్న మాట. హృదయేశ్వరులు కూడానా?"

"ఉహుం." తల విదిల్చాడు కృష్ణ. "బ్రహ్మచారిని. అర్భకుడిని."

"మరి ... మా కథ వ్రాస్తారా?" కుతూహలంగా చూసింది చంద్రిక.

"కాదు. వ్రాసిన కథకు మీ సాయం కావాలి."

"ఆవిష్కరించమంటారా?"

"మీరు చదువుకున్నారా?"

"వ్యభిచారులు చదువుకోవలసిన అవసరం లేదు, తండ్రీ! జీవితమే నేర్పుతుంది!"

"నే వ్రాసిన నవలకు అట్టమీద బొమ్మ నువ్వు కావాలి, చంద్రికా!"

"అంటే నా బొమ్మ తీసి కవరు ప్రింట్ చేస్తారన్న మాట." తల ఊపాడు కృష్ణ.

కొన్ని క్షణాలు అతణ్ణి మౌనంగా చూసింది. తరవాత తల ఊపింది.

"రేపు ఆదివారం సాయంత్రం." చంద్రిక చేయిని చేయి వేసి మృదువుగా నొక్కాడు.

అతడి చేతిని తీసివేయలేదు చంద్రిక. అతడు తీయబోతే మరింత బిగించింది. ఆ హస్తాన్ని అలా బిగించితే ఎన్నో జన్మల వెనక నడిచిన అనుభూతి కలిగింది కృష్ణకు.

కాటుకతో పెద్దవైన నేత్రాలు, కోలముఖం, పెదవులు, మెడ, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, పొట్ట ... చేతిని పెదవులకు తాకించుకుని దగ్గరగా జరిగి, వణుకుతున్న చేతులతో భుజాల్ని తాకి, చంద్రికను కావలించుకుని పెదవులు తాకాడు.

"ఏమిటిది?" ఉక్కిరి బిక్కిరయింది. "నన్ను క్షమించు." ఆమెనుండి చేతులు విడదీసి, ఉచ్ఛ్వాసతో శరీరం కట్టెలా చేసి ఉద్రేకాన్ని నిగ్రహించుకున్నాడు.

తలుపుమీద శబ్దం అయి కాక ముందే కృష్ణను గుర్తు పట్టి తలుపు తీసింది శారద. మెలుకువతోనే ఉందన్న మాట.

"మీ రెళ్లిన పది నిమిషాలకు ఎవరో వచ్చి తలుపు బాదారు. భయమేసింది." శారద గొంతులో వణుకు ఆమె స్థితిని తెలియజేసింది. తన్ను తాను నిందించుకున్నాడు, అలా ఒంటరిగా వదిలి వెళ్లినందుకు. "చలపతికి చెప్పాను వారింటి పరిసరాల్లో ఇల్లు చూడమని. ఇక్కడ నుంచి బయట పడదాం."

అతడు పరుండి నిద్రకు ఉపక్రమించబోతుంటే మెల్లగా, అతి మెల్లగా అతడికి వినపడాలనో, వినపడకూడదనో పలికింది శారద: "అది ఆరోగ్యానికంత మంచిది కాదనుకుంటాను."

ఏదో అర్థం కాలేదు కృష్ణకు. సగం రాత్రి మెలకువన శారద పలికిన మాటల భావం బోధ పడింది. శారద కేసి కృతజ్ఞతగా చూశాడు. బాబు మీదగా పట్టిమీదకు జారిన నన్నని తెల్లని వేళ్లను, తాకకూడ దనుకుంటూనే మొన్న దుర్గను, ఈ రోజు చంద్రికను చూసి నిద్రాణమై ఉన్న అతడి కోర్కెల మేలుకొలుపు పాటలు తిరిగి ట్యూన్ చేయబడిన అనుభూతి నిద్ర పోని కారణాన, స్పృశించాడు. శారద నిద్రన కదిలింది.

'తప్పు. అలా చేయకూడదు. ధర్మం గాదు. నన్ను క్షమించు, శారదా! రామారావ్! ఐ యు 'సు సారి!'

* * *

"ఏమి టంత స్పీడు?" కృష్ణ భుజాన చెయ్యేసి కుదుపుతూ పలికింది దుర్గ. "టాప్‌లో స్పీడు లిమిటెంతో తెలుసా?"

(తరువాయి 38 వ పేజీలో)

తీన్ దేవియా

(35 వ పేజీ తరువాయి)

"తెలుసు, దుర్గా, నీతో ఓ పది నిమిషాలు మాట్లాడాలి. అభ్యంతరమా?"

"అభ్యంతరమా? ఐ లవ్ ఇట్, కృష్ణా, ఐ లవ్ ఇట్. మాట్లాడు."

దుర్గ నోమారు పరిశీలనగా చూశాడు కృష్ణ. వల్లని చీరతో ఒంటిని బిగించుకుంది. పైటను ఎడమ నుండి తిప్పి కుడిభుజం మీదుగా ఎడమ భుజాన వేసుకుంది. తలను దాల్చిన మల్లెల అంచులు తొంగిచూస్తున్నాయి. మెల్లగా ఎర్రని పెదిమల్ని విడదీసి నవ్వింది.

"కూర్చోకూడదా?"

కూర్చుంది దుర్గ. చుట్టూ సముద్రపు అలల శబ్దం; నన్నగా వీస్తున్న గాలి.

"రెండు రోజుల క్రితం చంద్రికను చూసిన తరవాత తెలిసింది, దుర్గా, నేను ప్రకృతినని, జడపదార్థాన్ని కానని."

ఇసుకను పిడికిట బిగించి చిటికెన వ్రేలిని వదులు చేసి ధారగా పాదాలమీద పోసుకుంటూ పలికాడు కృష్ణ. అతడి పిడికిటికి, పాదాలకు మధ్య కుడి అర చేయి మడిచింది దుర్గ. "అంటే?"

"నువ్వు ... నువ్వు కావాలి, దుర్గా!" అతడి గొంతు వణుకుతూంది. "నువ్వు నాకు సంపూర్తిగా కావాలి, దుర్గా. నీకు... ఎలా ... ఎలా తెలియజెయ్యాలో తెలియటం లేదు."

"నా కర్థమయింది." దుర్గ మెల్లగా పలికింది.

వెన్నెల మల్లెపూవులా ఉంది. తెల్లగా ఉంది. చల్లగా ఉంది.

మేడమీద వెన్నెలలో తెల్లని పరుపున కుడివైపు ఒత్తిగిలి పరుంది దుర్గ. మేడ మీది కొచ్చాడు సుందరం. "దుర్గా!" అతడి చేయి పడి పలిగి నప్పబడినట్లున్న పడుమున చేయిచేసి పలికాడు.

వెన్నెలకు ఊర్ధ్వముఖి అయి భర్తకేసి చూసింది. "అలా ఉన్నావేం, దుర్గా?"

"ఎలా ఉన్నాను? డెస్డిమోనాను అనుమానించలేక బాధపడుతున్న ఒథెల్లోలా ఉన్నానా?"

సుందరం మెల్లగా నవ్వాడు. సుందరానికి చాలా ఇష్టమైన డ్రామా ఒథెల్లో.

"ఈ రోజు కృష్ణ కనుపించాడు." సుందరానికి ముఖతా పరిచయం లేకపోయినా, దుర్గ మాటల్లో అతడు పరిచయం.

"ఏమంటున్నాడు?"

దుర్గ రెండు క్షణాలు భర్త ముఖం కేసి చూసింది. "నన్ను కావాలన్నాడు."



జత చిత్రం—కొరసాల సీతారామస్వామి

పైలెన్స్. ఏ లాంగ్ పైలెన్స్.

"నువ్వు... నువ్వేమన్నావు?" మాట తడబడింది సుందరానికి.

"మిమ్మల్నెలా మోసం చేయగలన్నారు?" అతణ్ణి కావలించుకుంటూ పలికింది దుర్గ.

"అలా చేయకు, దుర్గా, నేను భరించలేను."

* * *

"నీకు ఎంతివ్వాలి, చంద్రికా?"

కృష్ణనోసారి చూసి నవ్వింది చంద్రిక. "ఇన్నాళ్లు మనిషిని భరించినందుకు తీసుకున్నాను కాని, ఫోటో తీయించుకున్నందుకు కాదు. రే ఔలా చెప్పేది?"

ఫోటోకు ముందు చలపతి పరిచయం చేశాడు చంద్రికను. స్నేహితురాలిగా ఇంట్రడ్యూస్ చేశాడు.

చలపతి వచ్చాడు. "వెళదామా, కృష్ణా?"

చంద్రిక కేసి చూశాడు కృష్ణ. ఎక్కడి కన్నుల్లు చూసింది.

చలప తొక రిక్షాలో; చంద్రికా కృష్ణ లొక రిక్షాలో ఎక్కారు. "ఇలా రిక్షాలో నీ పక్కగా, నిన్ను తాకుతూ ... మరిచిపోయిన జ్ఞాపకాలు గుర్తు కొస్తున్నాయి."

"ఊహుం ..." కండ్లు పెద్దవిచేసి అంచుమండి నవ్వింది చంద్రిక. అతడి పిపు నుండి చేయి తిప్పి పడుమున నొక్కింది. "ప్లీజ్! తాకకు. రిక్షా పెడిపోతుంది."

"ఇతడి పేరు రాజా! ఆస్ట్రేంటు స్టేషను మాస్టరుగా వర్కు చేస్తున్నాడు. ఈ బొమ్మ పేరు చంద్రిక. స్నేహితురాలు." నమస్కరించింది చంద్రిక. "ఈ ఇద్దరు నాకు ఆప్తులు, స్నేహితులు, చంద్రికా!"

చలపతి, రాజా, కృష్ణ విడిపోతూ 'బై' చెప్పుకున్నారు. బట్టల దుకాణంలోకి పోతూంటే ఆపింది చంద్రిక కృష్ణను: "ఎందుకు?"

"పనుంది. ప్లీజ్ ఫాలో మి. నన్ను అనుసరించుము."

పసుపు పచ్చని చీర, ఆకు పచ్చని పూలు—చంద్రిక ఒంటినిండుగా కప్పి, తరవాత తీసి పాక్ చేయించాడు. మరో చీరను పాక్ చేయించాడు.

ఆ పాకెట్‌ను చంద్రిక చేతుల్లో పెట్టాడు. "ఏమిటిది?" విస్మయంగానూ, ఆందోళనగానూ అడిగింది చంద్రిక.

"మరో మాట చెప్పకుండా ఉంటేనూ, అభ్యంతర పెట్టకుండా ఉంటేనూ చెపుతాను, చంద్రికా! అది చీర. బొమ్మలు కట్టుకుంటే బాగుంటుంది. నీకోసం."

"చాలామంది వ్యక్తులు నాకు ఋణం, కృష్ణా. నేను నీకు ఋణం."

"అంటే?" వింతగా అడిగాడు.

"నగటి పరిచయాల జీవితం కాదు మాది, కృష్ణా! వెలుగు చోచక నీకటి మిగిలిపోయినదాన్ని. బయట తిప్పుతున్నావు. చదువుకున్న వారిని, మంచి తనాన్ని పరిచయం చేస్తున్నావు. ఇది ఋణం కాదా?"

"చాలా పొరపాటు. ఏ వ్యక్తి మరో వ్యక్తికి ఋణపడి ఉండడు, చంద్రికా! అది స్వార్థం. నాది స్వార్థమేమో?"

నవ్వింది చంద్రిక. "కావచ్చు. కాని, రేపటి నీ స్వార్థం ఈ రోజుకు మంచైతే చాలదా, కృష్ణా!"

పక్కపక్కగా చెరో పాకెటుతో నడుస్తున్న ఆ ఇరువురిని సాయంకాలపు వీధి ప్రజ వింతగా చూడసాగారు.

"కృష్ణా!"

తల పక్కకు తిప్పి చంద్రికకేసి చూశాడు.

"నా దో కోరిక—మన్నిస్తావా?"

"మన్న నడిగించుకునేటంత వ్యక్తిని కాను. అడుగు, చంద్రికా!"

"నీ చేతితో నా చేతిని కలిపి పట్టుకోగలవా?"

వింత మానిసయాడు కృష్ణ. తరవాత మెల్లగా నవ్వాడు. ఎడమచేతి పాకెటును కుడిచేతికి మార్చుకుంది. ఆమె ఎడమచేతి వేళ్ల పాయలను తన కుడిచేతి వేళ్లతో కలిపి బిగించాడు. జవం కేసి గర్వంగా చూసింది చంద్రిక. తన విలా జీవితంలో ఇంత అందంగా, హుందాగా ఎన్నడైనా నడవగలదా? ఇల్లు సమీపించే కొలది గడిచినదంతా కలగా తోచి ఏడ్పు వచ్చింది చంద్రికకు.

ఆమె ఇంటి వాకిట పాకెటులో ముఖం దాచుకు ఏడ్చింది చంద్రిక.

"ఏమిటి, చంద్రికా? ఏమైంది?" అర్థం కాలేదు కృష్ణకు. "నే వెళతాను."

కండ్లు తుడుచుకుని బలవంతాన నవ్వింది. "తిరిగి కనిపిస్తావా?"

తల ఊపాడు.

* * *

"ఎలా ఉంది? ఈ ఇల్లు, ఈ లొకాలిటీ?"

"బాగుంది." నన్నగా నవ్వుతూ జవాబిచ్చింది శారద.

పాదాలకు చుట్టుకున్న బాబును చేతుల్లోకి తీసుకున్నాడు. చలపతి ఇంటికి రెండిళ్ల ఇవతలగా ఓ చిన్న పోర్షను అద్దెకు సంపాదించాడు. ఆరోజు ఉదయమే అక్కడకు చేరారు.

"చలపతి చెల్లెలు సుందరిట, తనే వచ్చి ఇల్లంతా సర్దింది."

"సుందరా? షీ ఈజ్ ఎ పైన్ గర్ల్!"

చేతిలోని పాకెటును శారద కందించాడు. "ఏమిటిది?" పాకెట్టు అందుకుంటూ అడిగింది శారద.

"చీర. బాబుకు లాగు, చొక్కా."

శారద చేతుల మధ్య పాకెట్టు వణికింది. "ఎందుకు?" చాలా నీరసంగా పలికింది.

ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు కృష్ణకు. అవును? ఎందుకు? చంద్రికకు తీస్తూ శారద గుర్తుకొచ్చి తీసుకొన్నాడు.

"మీరు బయట తిరిగేవాళ్లు. మీరు తీసుకోక నా కెందుకు?" పాకెట్టును గట్టిగా పట్టుకుంది శారద.

"నేను మగవాణ్ణి. నే నెలా ఉన్నా పర్వాలేదు."

అంటే తను బాగుండాలనా? తను అందంగా ఉండాలనా? ఎందుకు? ఎవరి కోసం? అదే ప్రశ్న శారదకు తెలియకుండానే బయటకు వచ్చింది

"నాకోసం."

ఉలికిపడింది. కండ్లు పెద్దవిచేసి చూసింది. మనిషి కొద్దిగా వణికింది.

"మాటల్లో తప్పులు దొర్లితే క్షమించు, శారదా?"

"ఎలా ... ఎలా క్షమించమంటావ్, కృష్ణా! అది ఎంత తప్పో తెలుసా? మరోసారి అనకు. అడగకు. మనసులో ఉండవచ్చునేమో? పైకి చెప్పకు. మన స్నేహాన్ని, గౌరవాన్ని మాటలతో చెడగొట్టకు."

• • •

"ఏలనో నే కీ రాధిక వింత అందముగా తోచుచున్నది?"

"అతిశయ మెందుకులే, గోపకా! నే చంద్రికను. రాధ నేల యగుదును?"

"రాధయే చంద్రిక. చంద్రికయే రాధ. ఇరువురి ఆత్మ లొక్కటియే!"

"ఆత్మకు నిర్వచనము?"

"గత జన్మకు మిగిలిపోయిన కర్మార్థము."

"కర్మ యనగా?"

"జీవరాసుల పాపపుణ్యములు. జీవన స్థితిగతులు."

"ఇన్ని మాటలు నేర్చినవాడవు. పైపెచ్చు కృష్ణుడవు. రాధ మనసునే ఎరుగ వైతివా? తెలిసియూ నిర్లక్ష్యమా? రిత్త మాటలచే కాలమును ఉత్తిగనే ముగించుచుంటివి."

"నేను కార్యార్థినికాని, క్రియార్థిని కాను, చంద్రికా?"

"కాదులే! ఈ చంద్రిక శరీరము పాపపంకిలమూ, పవిత్రులకు నిషేధమూ గదా?"

"మనసు నెంత గాయము చేసితివి, చంద్రికా! శరీరము దేవాలయము. ఆత్మ దేవుడు. పవిత్రాపవిత్రులు దేవాలయమున అడుగిడెదరు. ఆత్మను చేరున దెందరు?"

చంద్రికను రోజుకో మారు చూడటం దినచర్య అయింది కృష్ణకు.

"వెళతాను, చంద్రికా?"

"నీ ఇష్టం, కృష్ణా. ఉండమని అడుగుదాననే కాని, ఆజ్ఞాపించు దానను కాదుగా!"

• • •

చీరను ఒంటిచుట్టూ బిగించుకుని అద్దంలో చూచుకుంది శారద. మోహనంగా ఉంది ప్రతిబింబం. తలుపు గడియ తీసింది. చీరను వదులు చేసింది. పసుపు పచ్చని చీర, ఆకుపచ్చని పూలు—శరీరాని కెంత అందంగా ఉందో అర్థమైంది. మదుట బొట్టు పెట్టుకుంది.

చాలా క్షణాలు అలాగే కదలక అద్దంలో చూసుకుంటూ కూర్చుంది. తనను అందంగా చూడాలనే తలపు కృష్ణలో ఎందుకు కలిగింది? అతడి మంచితనం వెనక చెడు విశ్రాంతి తీసుకుంటూందా? కాదు. అది అబద్ధం. అతడు తన్నీ సంవత్సర కాలం గౌరవంగా చూశాడు. అతడి కెంత అవకాశం లేదు, ఈ ఆరు కోట్ల ముప్పది లక్షల డెబ్బది రెండువేల క్షణాల్లో? తప్పేం చేయగూడదు? వయసున ఉన్న వ్యక్తి. పెండ్లి కాని వ్యక్తి. అలా జరగలేదు.

అసలు తను ఎందుకు మాట్లాడలేక పోయింది—అతడు నా కోసమని పలికితే, ఏమిటీ మీ ఉద్దేశ్యం అని? అతడికి తను అందంగా, ఆకర్షణీయంగా కనపించటం తనకూ ఇష్టమేనా? అమ్మో! తప్పు. అలా అనుకోకూడదు. చెంపన కొట్టుకొంది శారద. తరవాత బాధ పడ్డది. చెంపనైతే కొట్టుకుంది. మనసు? తను ఎప్పిసార్లు మనసున అతడితో ...? చొరవ చేస్తాడనుకుంది. చేయడం? చేస్తే తనొప్పుకొనేదేనా? అమ్మో. తప్పు! అనుకోగూడదు. పెట్టెలో అడుగు నొక్కడో 'పతివ్రతల కథల' పుస్తకం ఉండాలి. రేపటినుండి చదువుకోవాలి.

తలుపు నెవరో శబ్దం చేస్తున్నారు. మెల్లగా లేచి తలుపు తీసింది. తలుపు కావల సంస్కారం కలిగిన ఆడమనిషి నవ్వింది. "నా పేరు విశాలాక్షి." తనూ నవ్వింది శారద, పరిచయంగా. "మీరు కొత్తగా చేరారనుకుంటాను." తల ఊపింది శారద. "శ్రావణ మంగళ వారం నోము నోచుకుంటున్నాం. మీరు తప్పక రావాలి." భరిణ నుండి కుంకుమ తీసి శారద ఫాలభాగాన ఉజ్జ్వలంగా కుంకుమ పెట్టింది.

శారద తేరుకునే లోపల ఆవిడ తన ఇంటిని చూపి తప్పక రమ్మని మరో మారు హెచ్చరించి, అబ్బాయి బయటకు వెళ్లాడా అని అడిగి తను నిష్క్రమించింది. అద్దం ముందుకు వెళ్లి చూసుకున్న శారదకు తను చేసిన పొరపాటర్థమయింది. తనెంత అవివేకి! తనన లీ రంగు చీరలు కట్టగూడదు. తలను వెంట్రుక లుంచగూడదు. తన తల్లి యౌవనంలోనే తండ్రి పోతే, వెంట్రుకలు తీయించుకుని, ధవళ వస్త్రాలు కట్టుకుంటూ కృష్ణా! రామా! అనుకుంటూ గడిపింది. తను ... తను ... కండ్ల వెంట నీరు తిరిగింది. బొట్టును తుడిపేసుకోబోయింది. శారద కుడిచేతిని మరో చేయి మృదువుగా పట్టుకుని ఆ ప్రయత్నం నుండి విరమింపజేసింది.

"సుందరీ ... నువ్వా!"

"అవును, నేనే నక్కా. ఏమిటీ నీ పిచ్చి ప్రయత్నం? ఆ అద్దంలో చూసుకో ఎంత బాగున్నావో? పన్నీరు నిండిన గాజు గోళంలా ఉన్నావ్? ఎందుకు శూన్యంలో బూడిదన తొణికిపోవాలని ప్రయత్నం? తుడిపేసుకోకు. నా మీద ఒట్టే."

"మనుష్యుల ప్రమాణాలతో దేవునికి సంబంధం లేదు, సుందరీ."

"ఎంత పిచ్చి, అక్కా! మనిషి చేతుల్లోని పనిని దేవుని మీదకు నెట్టేసి కర్మ అని మూలన కూర్చోవటం తెలివి తక్కువ — తెలుసా?"

"నే భర్త పోయిన ఆడదాన్ని, సుందరీ!"

"అందుకే నక్కా ఇంత జెప్పటం. జాజి తీగకు ఆధారంగా పందిరి నాటుతాం. పందిరి పాడయిందని, పుచ్చిపోయిందని జాజిని వశించి పొమ్మంటామా?"

"తార్కికంగా మాట్లాడకు, సుందరీ."

"తార్కిక మనకు, నీ కిష్టం లేదు. సరే! నిన్ను వదిలేద్దాం ... మరి కృష్ణ?"

"అతడిని నేను చేసుకోవద్దన్నానా, సుందరీ?" చాలా బేలగా పలికింది శారద.

"నువ్వు వద్దన లేదక్కా. అతడిని ఎవరు చేసుకుంటారు? నీకూ, అతడికీ సంబంధమని అంతటా పుకారు. అతడి కెవరు పిల్లనిస్తారు? పోనీ ఇచ్చారనుకో! అతడి సంపాదనతో నిన్నూ, ఆమెనూ పోషించగలడా? నిన్నా వచ్చే స్త్రీ ఇంట్లో ఉండనిస్తుందా? కొన్నిచోట్ల ధర్మాలను విడవాడాలి, అక్కా, బ్రతకటంకోసం. బాబేం కావాలి, నువ్వేం కావాలి అతడి మార్గాన్ని అత డెన్నుకుంటే? గుండె మీద చెయ్యేసుకు చెప్పక్కా! నువ్వెప్పుడూ మనసున అతడిని దగ్గరగా యోచించలేదా?"

నిరుత్తరయింది శారద. ఎలా ... ఎలా చెప్పగలదు ఆలోచించలేదని?

"సుందరీ ... ప్లీజ్! నన్ను ఆలోచించుకోనివ్వు." మనిషి తేలిపోతూ సుందరి చేతుల్ని తప్పుకుని మంచంకేసి నడిచింది.

సినీతార శ్రీప్రద (శ్రీ—17)

"కంగ్రాచ్యులేషన్స్!" రాజా, చంపతి, దుర్గలు కృష్ణను అభినందిస్తూ పలికారు.

"థాంక్స్, ఫ్రెండ్స్!"

కృష్ణ వ్రాసిన 'ఏంజల్ ఆఫ్ స్వీట్ నెస్' ఇండియాలో బెస్ట్ పెల్లింగ్ బుక్కయింది. దాని సెకండ్ ఎడిషనును కాల్స్ అండ్ సైమన్ కంపెనీవాళ్లకు అమ్మేశాడు. అవి కోర్గి బుక్స్‌గా విడుదలవుతాయి.

"ఏజం!?" కండ్లు పెద్దవి చేసి ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కండ్లద్వారా ముఖమంతా ప్రకటించింది చంద్రిక.

"అది అంత గొప్ప బుక్ కావటానికి కారణం నువ్వు, చంద్రికా, నువ్వు ..."

"నిన్ను ఎలా అభినందించేది, కృష్ణా!" చుట్టూ వెతుక్కో సాగింది. తను తప్ప మరేది ఆ గదిలో కనిపించలేదు.

అతడికి దగ్గరగా జరిగి మెడ వెనక చేతులు బిగించి తనకు దగ్గరగా లాక్కుని పెదవ ముద్దు పెట్టుకుంది.

• • •

ఇంటి కొచ్చేసరికి ఇల్లు తాళం వేసి ఉండటం ఆశ్చర్యం కలిగించింది కృష్ణకు. ఎక్కడకు పోయి ఉంటుంది శారద? అర్థం కాలేదు కృష్ణకు.

మొన్న చీర తెచ్చినదాది తనతో ముభావంగా ఉంటూంది శారద. ఇప్పు డెట్లైనా? తను చాలా పొరపాటు చేశాడు, ఆ చీర తెచ్చి. తను శారదంటే ఇష్ట పడకూడదు. తప్పు. స్నేహితుడికి ద్రోహం. కాని, మనసున శారద ఎందుకు బలవత్తర మవుతూంది? శరీరం తప్పు చేస్తే ప్రాయశ్చిత్తం ఉంది. మనసు చేస్తే ...? నువ్వంటే ఇష్టం, శారదా! కాని ... ఎలా చెప్పేది?

కృష్ణ ఆలోచనలు చెదిరిపోయినాయి. నిరుత్తరుడై వాకిటికేసి చూస్తూండి పోయాడు. ఆకుపచ్చని పూలు, పసుపు పచ్చని చీరను ఒంటిని బిగించి, నుదుట తిలకం, కురుల మల్లెలు, పాదాల పసుపు, బాబుతో చిన్న చిన్న అడుగులు వేయిస్తూ సుందరితో కలిసి నవ్వుతున్న శారదను మొదట గుర్తు పట్టలేకపోయాడు.

కృష్ణ మనసా అడుగులు తడబడ్డాయి శారదకు. సుందరి శారద చేతిని బిగించి పట్టుకుని కృష్ణకు దగ్గరగా, తలుపుకి దగ్గరగా నడిపించింది. తనే తలుపు తీసింది సుందరి. "తరవాత వస్తా" నంటూ వెంగువ దూకి వాకిట మాయ మయింది. కృష్ణ బాబు నెత్తుకున్నాడు. తలుపులు వారి వెనక మూసుకున్నాయి.

మనసున కొద్ది తొట్రుపాటు, అర్థం కాని ఆందోళనతో కాలి బొటన వేలితో గచ్చున గీతను గీయసాగింది శారద. చాలా క్షణాల్ని నిశ్శబ్దం మింగివేసింది. బరువై వాలుతున్న కనురెప్పలను పైకెత్తి కృష్ణకేసి చూసింది. కృష్ణ కర్థం కాలేదు, అంత సౌందర్యాన్ని, ఆమెను ఏం చేయాలో?

• • •

"గంగులూ!" చీకటింట ప్రతిధ్వనించింది ముసలిదాని గొంతు. ఉలికి పడ్డాడు, కునికిపాట్లు పడుతున్న గంగులు. "గంగులూ, ఎక్కడ చచ్చావ్?" తిరిగి ఖంగుమంది ముసలిదాని గొంతు. పరుగెత్తుకుంటూ వెళ్లాడు ముసలిదాని ముందుకు. వాళ్ళి కాలితో పకాలించి తన్నింది. "ఛీ! ... ఎంగిలి మెతుకులు తినే కుక్కా! చంద్రిక మాయమైంది. ఎటు పోయిందో చూడు." రొప్పుతూంది ఆయాసంతో.

గంగులు అలాగే నిలుచుని దాని ముఖం కేసి చూశాడు. "నగలూ, నాణ్యాలేమైనా పోయాయా?"

"నగలు,నాణ్యాలుపోతే బాధేముందిరా? చంద్రికే పోయింది. దాన్ని తక్కెట పడితే కృష్ణుడే తేలి కవుతాడురా. వెళ్లు. వెళ్లి వెతుకు, బండ నా కొడకా!"

• • •

దుర్గకు వెన్నెట నిద్ర రాలేదు. సాయంత్రం కలిసిన కృష్ణ గుర్తు కొచ్చాడు. నువ్వు నాకు సర్వస్వం కావాలి, దుర్గా! అంటే తనేమన్నది? మరోసారంది. ఎప్పుడు? దీనికి జవాబు లేదు. ఎప్పుడో ఓ సారి. యౌవనం కరిగిపోయిన తరవాతనా? వార్ధక్యం తొలిదశలోనా? శీలానికి విలువ పడిపోయిన తరవాతనా? తను అందినా అత డందుకునే సమయం దాటిపోయిన తరవాతనా?

మనసున మసుక్కుంది దుర్గ. ఒంటరి తనం, అందునా యౌవనంలో మనిషిని పిచ్చివాణ్ణి చేస్తుంది. కండ్లు మూసుకుంది.

• • •

పగటి నాగరికత, రాత్రి కప్పిన ఆ చీకటి పట్టణాన ఆ గదిలో లేదు. అది తమస్సు. ఏది ఏదో తెలియని దశ అది. తపోనంతరం శివ పార్వతుల కలయిక.

వాకిట చంద్రిక నవ్వింది. నవ్వి నవ్వి, నవ్వి ఏడ్చింది. చంద్రిక ఏడ్చింది. నిండు కొలువున దుష్యంత తిరస్కృతి పొందిన శకుంతలలా, ఆ చీకటిన, వెన్నెల ఉండి కనులు కనిపించని ఆ చీకటిన పసుపు పచ్చని చీర ఆకుపచ్చని పూలతో వెలావెలా పోతూండగా ఏడ్చింది, గవాక్షపు అంచున మోము ఉంచి.

తరవాత మెల్లగా కండ్లు తుడుచుకుంది. వారు మరిచి వదిలిన తలుపును తను దగ్గరగా చేరవేసింది.

వెనక్కు తిరిగిన చంద్రిక పరిచయం లేని స్త్రీ మూర్తిని చూసి ఆగిపోయింది.

"మీరు! ..." మెల్లగా నవ్వింది దుర్గ. ఆమె నవ్వు వారిరువురి మధ్య తెరలను తొలగించింది.

"నా పేరు దుర్గ. అతడి జీవితంలో మొదటి అధ్యాయాన్ని." చంద్రిక చేతిని తన చేతిలోకి తీసుకుంటూ పలికింది.

"మీరు! ..."

తనూ నన్నగా నవ్వింది చంద్రిక "నా పేరు చంద్రిక. చివరి అధ్యాయాన్ని."

ఇరువురూ వెన్నెల పరుచుకున్న రోడ్డు మీది కొచ్చారు. ఎదురెదురుగా నిలుచున్నారు.

"అతడు నాకు స్నేహితుడు. నా కలా చూసుకోవటమే ఇష్టం."

దుర్గ మాటల్ని విని చాలా క్షణాలు మాట్లాడలేదు చంద్రిక. తరవాత మెల్లగా అంది: "అతడు నాకు దేవుడు ... నా కలా చూసుకోవడమే! ..." మిగతా మాటలు వినపడలేదు. వినిపించింది ఏడ్పు.

చంద్రికను కావలించుకుని ఓదార్చింది దుర్గ.

తలుపు వెట్టింది చంద్రిక. తెరుచుకున్న తలుపులకేసి ముసల్ది, గంగులూ ఆదుర్దాగా చూశారు. "ఆ ... చంద్రి కొచ్చింది." ఆనందంగా కేకేశాడు గంగులు.

"ఏమే, పిచ్చిదానా! ఎక్కడికి పోయావ్?" ఎప్పుడూ చంద్రిక ఒంటిన చూడని చీరను వింతగా చూస్తూ అడిగింది ముసల్ది.

"భూమి గుండ్రంగా ఉండవ్వా" మోము నలుముకున్న వెంట్రుకలను వెనక్కు తోసుకుంటూ పలికింది చంద్రిక.

"ఇది కనుక్కోవడానికా వెళ్లావు, పిచ్చి కూనా! వ న్నడిగితే చెప్పకపోయానా?"

ముసలిదాన్ని కావలించుకుని ఏడ్చింది చంద్రిక.

అర్థంకాని చంద్రిక [illegible] ముసల్దాని అంతరాల మధ్య [illegible]పింది. దాని కండ్ల వెంట నీళ్లు తిరిగినాయి. ★



శిఖరం

ఫోటో—భరద్వాజ (మద్రాసు—18)